కాసాని గెలిస్తేనే చేవెళ్ల అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ మండలంలోని పాలమాకుల నాయకులతో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : చేవెళ్ల ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపునకు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. ఆదివారం శంషాబాద్ మండలంలోని పాలమాకుల, ముచ్చింతల్, ఘాన్సీమియాగూడ గ్రామాలకు చెందిన బూత్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో తన నివాసం వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీగా కాసాని గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కాసాని గెలిస్తేనే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని వివరించారు. బీసీ నాయకుడిని గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజేంద్రనగర్ నుంచి భారీ మెజార్టీ ఇవ్వాలని.. అందుకోసం బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు వేసేలా చూడాలన్నారు. జాతీయ పార్టీలుగా చెప్పుకొంటున్న కాంగ్రెస్, బీజేపీలకు ఓట్ల ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేవెళ్ల పార్లమెంట్‌కు ఎలాంటి అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధి పనులు తప్ప చేసిందేమీలేదని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు 15 రోజుల పాటు సైనికుల్లా పనిచేసి అభ్యర్థి కాసానిని గెలిపించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు రాజుముదిరాజ్, జగన్‌గౌడ్, రవీందర్‌నాయక్, కృష్ణయ్యగౌడ్, రాంనాథ్ ముదిరాజ్, శ్రీధర్‌గౌడ్, శివరాంనాయక్, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

మణికొండ : చేవెళ్ల గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగురవేసి బీసీల సత్తా చాటుదామని మండల మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్‌ముదిరాజ్ అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ, కుమారుడు సాయి, పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలకు బొట్టు పెట్టి తన భర్తను గెలిపించాలని చంద్రకళ ఓటర్లను అభ్యర్థించారు. బడుగు బలహీన వర్గాల కోసం శక్తివంచన లేకుండా పని చేస్తున్న కాసానిని చేవెళ్ల గడ్డపై గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మల్లేశ్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భిక్షపతి, కృష్ణ పాల్గొన్నారు.

మణికొండలో సన్నాహక సమావేశం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మణికొండ బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వార్డులవారీగా నాయకులు, కార్యకర్తలు పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీరాములు, కుమార్, లక్ష్మణ్, జయరాజ్, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ఇంటింటి ప్రచారంలో కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ, కుమారుడు సాయి

ఆదివారం నగరంలో ఎండ తీవ్రత ఉండటంతో ప్రజలు బయటికి రాకపోవడంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్న వీఎస్టీ స్టీల్ బ్రిడ్జి

గ్రేటర్ @ 41.8 డిగ్రీలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండటంతో నగరం అగ్నిగుండాన్ని తలపిస్తోంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41.8డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 28.7డిగ్రీలు, గాలిలో తేమ 24శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మండుతున్న ఎండల కారణంగా మధ్యాహ్నం సమయంలో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. పనులను సైతం సాయంత్రానికి లేదా రాత్రికి వాయిదా వేసుకుంటున్నారు. దీంతో పగటిపూట నిర్మానుష్యంతో పాటు రోడ్లు సాయంత్రం అయ్యేసరికి రద్దీగా మారుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

వేసవి తాపాన్ని తట్టుకునేందుకు సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

ఎండలో వాహనాలు జర భద్రం..!

- నగరంలో అధిక ఉష్ణోగ్రతలు
- మనుషులకే కాదు.. వాహనాలకూ ప్రమాదమే..
- రంగు నుంచి ఇంధన ట్యాంకుల వరకు పరిశీలించాల్సిందే..
- ఎక్కువ కాలం వాహనాలను ఎండలో ఉంచొద్దంటున్న నిపుణులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : నగరంలో రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బయటకు వెళ్లాలంటే భానుడి భగభగలు చెమటలు పుట్టిస్తున్నాయి. అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లడం లేదు. ఇలాంటి పరిస్థితులతో నగరవాసులు బెంబేలెత్తుతున్నారు. అయితే ఎండ కేవలం మనుషులకే కాదు వాహనాలను సైతం బేజారెత్తేలా చేస్తుందని ఆటోమొబైల్ రంగ నిపుణులు, మెకానిక్‌లు చెబుతున్నారు. వాహనాలను బయట వదిలితే.. అవి కొద్దికాలంలోనే రంగు, రూపు కోల్పోవడమే కాకుండా తరచూ మరమ్మతులకు గురికావాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. కార్ల వంటి వాహనాల లోపలి భాగాలు కూడా తీవ్రంగా దెబ్బతింటాయంటున్నారు. వాహనాలు అసలు రంగు, మెరుపును కోల్పోతాయి. టైర్లు, సీట్లు, బ్యాటరీ, ఇంజిన్ లోపలి సున్నిత బాగాలు దెబ్బతింటాయి. ఇంధనం ఆవిరయ్యే ఆస్కారముంటుంది. కార్లలో ప్రమాదాల్లో కాపాడే ఎయిర్ బ్యాగ్‌లు కూడా దెబ్బతింటాయి. సీట్ల కుషన్లు, కవర్లు, అద్దాలు బలహీనమవుతాయని మెకానిక్‌లు చెబుతున్నారు. రోజుల తరబడి ఎండలో నిలిపితే కార్ల బాడీ కూడా దెబ్బతింటుంది.

జాగ్రత్తలు పాటిద్దాం..!

ఎండలో వాహనాలను నిలపాల్సి వస్తే తరచూ వాటిని నీటితో శుభ్రం చేయడం, అద్దాలకు అడ్డుగా ప్యాడ్‌లను కట్టడం, మొత్తం వాహనాన్ని చుడుతూ కవర్లు బిగించడం ఉత్తమం. ఎండాకాలంలో ప్రతీ వాహనదారుడు కచ్చితంగా తరచూ టైర్లు, బ్యాటరీలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవడం తప్పనిసరని ఆటోమొబైల్ నిపుణుడు నాయుడు తెలిపారు. ఎండ నుంచి రక్షణ కల్పించే కోటెడ్ వ్యాక్స్ వాడటం మంచిదని తెలిపారు. ఫిల్మ్ కూడా అందుబాటులో ఉంది. అవకాశం ఉంటే తప్పనిసరిగా వాహనాన్ని నీడలో నిలిపే ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రతిరోజూ శుభ్రం చేయాలి. ఎక్కువ కాలం ఎండలో నిలిపిన వాహనాలను తిరిగి వినియోగించేటప్పుడు విధిగా టైర్లలో గాలి చెక్ చేసుకోవాలని సూచించారు. బ్యాటరీ, ఇంధన ట్యాంకులు కూడా సరిచూసుకోవాలని చెప్పారు. అంతేకాదు ఉష్ణోగ్రతల కారణంగా కార్లలో ఇటీవల మంటలు వ్యాపిస్తున్నాయి. ఎలక్ట్రిక్ అమరికల కారణంగా ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో వాహనాల బాడీ స్టీల్‌తో నిర్మించేవారు. ప్రస్తుతం వేగంగా దూసుకెళ్లేందుకు, మైలేజీ పెంచేందుకు ఫైబర్, ప్లాస్టిక్ వినియోగం పెరగడం వల్ల కార్లు త్వరగా దగ్ధమవుతున్నాయి. నాసిరకం ఎలక్ట్రికల్ పరికరాలను ఉపయోగించడం కూడా ప్రమాదాలకు తావిస్తున్నాయి. సామర్థ్యానికి మించి లోడ్ పడినప్పుడు షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఓటు అనే ఆయుధంతో..

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- అత్యధిక జనాభా కలిగిన బీసీలకు కాంగ్రెస్, బీజేపీలు ప్రాధాన్యత ఇవ్వడంలేదు
- బీసీల సమస్యలపై మాట్లాడే గళం పార్లమెంటులో ఉండాలి
- బీసీ బిడ్డ 'కాసాని' గెలుపుతోనే అది సాధ్యమంటున్న బీసీ సంఘాలు



బీసీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని బీసీ సంఘాలు పేర్కొంటున్నాయి. బీసీల్లో విభేదాలు సృష్టించేందుకు కొందరు కుయుక్తులు పన్నుతున్నారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అత్యధిక జనాభా కలిగిన బీసీలకు బీఆర్ఎస్ పార్టీ తప్ప ఇతర పార్టీలేవీ ప్రాధాన్యత ఇవ్వడం లేదని బీసీ నేతలు వాపోతున్నారు. స్వలాభాపేక్ష కోసమే తప్ప బీసీ కులాల సమస్యల పరిష్కారానికి ఏ రాజకీయ నేత కూడా చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల లోక్‌సభలో బీసీలకు బీఆర్ఎస్ పార్టీ మంచి అవకాశం కల్పించిందని చెబుతున్నారు. బీసీల సమస్యలపై మాట్లాడే గళం పార్లమెంటులో ఉండాలని, బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతోనే అది సాధ్యమని వారు స్పష్టం చేస్తున్నారు. మన ఓట్లను మనమే వేసుకుందామన్న నినాదాన్ని బలంగా తీసుకెళ్లాలని, సభలు, సమావేశాలతో బీసీలను చైతన్యవంతులను చేద్దామని నేతలు పిలుపునిస్తున్నారు. **- రంగారెడ్డి, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ)**

బీసీల సత్తా చాటుదాం

96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి అందరినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చిన చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి బీసీల సత్తా చాటుదాం. అన్ని రాజకీయ పార్టీల నేతలు బీసీ సామాజిక వర్గానికి చెందిన మంచి వ్యక్తిని గెలిపించుకునేందుకు రాజకీయాలు పక్కన పెట్టాలి. మన ఓట్లు మనమే వేసుకుందాం. *- రమేశ్, తాండూరు*

బీసీ ముద్దు బిడ్డ జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం

బీఆర్ఎస్‌తోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుంది. పార్టీలకు అతీతంగా బీసీలమంతా ఒక్కటైతే బీసీ ముద్దు బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో ఘన విజయం సాధిస్తారు. బీసీల కోసం అనేక ఉద్యమాలు చేసిన జ్ఞానేశ్వర్‌ను బీసీలంతా ఆశీర్వదించాలి. బీసీలు సంపూర్ణ మద్దతు ఇస్తే పార్లమెంట్‌లో విజయం ఖాయం. *- ఎర్రం వసంత, మున్సిపల్ కౌన్సిలర్, తాండూరు*

ఓటు బ్యాంకుగా చూసే నాయకులకు బుద్ధి చెప్పాలి

కాంగ్రెస్, బీజేపీలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయి. బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుంది. ఈ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి కాసానిని గెలిపించుకుంటే రానున్న రోజుల్లో బీసీల ప్రాధాన్యత రాజకీయాల్లో మరింత పెరుగుతుంది. అన్ని పార్టీలు బీసీలకు సీట్లు ఇచ్చేందుకు ముందుకొస్తాయి. కాసాని గెలుపుతో బీసీల్లో చైతన్యం వస్తుంది. *- మల్లేశం, రామయ్యగూడ, వికారాబాద్*

బీసీలు రాణించేందుకు ఇది మంచి అవకాశం

ఓటు మన చేతిలో ఉన్నది. ఇంతకన్నా ఏం కావాలి. కాంగ్రెస్ నాయకుల మాటలు బీసీలను అవమానపరుస్తూ.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. వెనుకబడిన బీసీలు రాజకీయాల్లో రాణించేందుకు ఇది మంచి అవకాశం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మన నాయకున్ని పార్లమెంట్‌కు పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. *- లక్ష్మయ్య, మాజీ సర్పంచ్, గుడుపల్లి, వికారాబాద్*

కలిసికట్టుగా గెలిపించుకుందాం

బీసీ సామాజిక వర్గానికి ఎంపీ టికెట్ ఇచ్చి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేశారు. అనుభవం కలిగిన నేత కాసానిని గెలిపిస్తే సామాజికంగా బీసీలకు న్యాయం జరుగుతుంది. అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా బీసీ నాయకుడిని చేవెళ్ల గడ్డ నుంచి ఎంపీగా గెలిపించుకోవాలి. ప్రత్యేకంగా బీసీ నేతలు ఐక్యతను చాటి విమర్శలకు బుద్ధి చెప్పాలి. *- సాయినాథ్ కుమార్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, చేవెళ్ల*

రంజిత్‌రెడ్డి ఓడిపోవడం ఖాయం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ బీసీ కులాలను ఏకం చేసేందుకు ఎన్నో పోరాటాలు చేసిన నాయకుడు. రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా అనుభవం గలిగిన కాసాని జ్ఞానేశ్వర్ 100కు 100 శాతం గెలుపొందడం ఖాయం. రూ.500 కోట్లకు చేవెళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా రంజిత్‌రెడ్డి టికెట్ కొనుగోలు చేసినా ఓడిపోవడం ఖాయం. *- తోట చంద్రశేఖర్, చేవెళ్ల మండల యువజన సంఘం అధ్యక్షుడు, చేవెళ్ల*

బీసీ ఉద్యమ నేతను గెలిపించుకుందాం

ఎలాంటి స్వార్థం లేకుండా సంవత్సరాల తరబడి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బీసీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ వస్తున్నారు. బీసీలు రాజ్యాధికారం వైపు రావాలని ఎన్నో ఉద్యమాలు చేశారు. ప్రతి ఒక్కరికి చేదోడువాదోడుగా ఉన్నారు. 93 బీసీల కులాలను ఏకం చేసిన బీసీ ఉద్యమనేత కాసాని. అలాంటి మంచి వ్యక్తిని పార్లమెంటుకు పంపిద్దాం. *- అనిల్ కుమార్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు*

కాసాని గెలుపునకు కృషి చేద్దాం

చేవెళ్ల పార్లమెంటు నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు కోసం కృషి చేద్దాం. ప్రతి బీసీ ఓటర్‌ను తట్టి లేపుదాం. ఎంపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు. బీసీలను గుర్తించి అన్ని రంగాల్లో బీసీలకు తగిన గుర్తింపు ఇచ్చింది కేసీఆర్. కుల వృత్తులకు జీవం పోశారు. *- పవన్ యాదవ్, యాదవ సంఘం నాయకుడు*

బీసీ నాయకుడు గెలుపే లక్ష్యంగా పని చేస్తాం

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. బీసీలపై అనుచిత వాఖ్యలు చేసిన వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ప్రతి బీసీ ఓటర్‌పై ఉన్నది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కేసీఆర్ బీసీలకు ప్రథమ ప్రాధాన్యతను ఇస్తున్నారు. అభ్యర్థి కాసానికి రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్నది. *- ప్రవీణ్‌గౌడ్, కిస్మత్‌పూర్*

సమయం ఆసన్నమైంది

బీసీలందరూ ఏకమై ఈ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి. చేవెళ్ల నుంచి మొదటిసారిగా బీసీకి టికెట్ దక్కడం అభినందనీయం. వివిధ పార్టీలకు అతీతంగా కాసానిని గెలిపించుకుందాం. అన్ని కులాల వారు కలిసి కారు గుర్తుకు ఓటు వేసేలా ప్రచారం నిర్వహిస్తాం. రాష్ట్రంలో 70 శాతం ఉన్న బీసీలు సత్తా చాటాల్సిన సమయం వచ్చింది. *- గణేశ్‌యాదవ్, బండ్లగూడ*

బీసీల కోసం పోరాడుతున్న జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

చేవెళ్ల నుంచి పోటీ చేస్తున్న జ్ఞానేశ్వర్‌ను గెలిపించి మన బీసీల సత్తా ఏంటో చూపాలి. కొన్నేండ్ల తరబడి బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న కాసానిని గెలిపించాలి. మన జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ నాయకులు మనకు అవకాశాలు తక్కువగానే ఇస్తున్నారు. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మన జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. *- వెంకటయ్య, బీసీ రైతు, అయినాపూర్, దోమ మండలం*

గౌరవం నిలువాలంటే గెలిపించి తీరాలి

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు కోసం బీసీలంతా ఐక్యంగా నిలువాలి. బీసీల ఐక్యతను చాటి మన గౌరవం నిలువాలంటే తప్పకుండా కాసానిని గెలిపించి తీరాలి. అగ్రకులాల నాయకులు మన బీసీలను హేళన చేసి మాట్లాడుతున్న ఈ తరుణంలో వారికి మన ఓటుతోనే సరైన బుద్ధి చెప్పాలి. *- నర్సింహులు, బీసీ సెల్ దోమ మండల అధ్యక్షుడు, రాకొండ*

బీసీల గళం వినిపించాలంటే బీఆర్ఎస్ రావాలి

పార్లమెంట్‌లో బీసీల గళం వినిపించాలంటే అది కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యం. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలి. పదవులు, వ్యాపారాల కోసం పార్టీలు మారే మోసగాళ్లకు తగిన గుణపాఠం చెబుదాం. జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపి, బీసీల గళం వినిపిద్దాం. *- మహేందర్ ముదిరాజ్, మియాపూర్*

చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయం

బడుగు, బలహీన వర్గాల పక్షాన నిరంతరాయంగా కొట్లాడుతున్న బీసీ నేత, బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి, గులాబీ జెండాను ఎగరేద్దాం. బీఆర్ఎస్ అడ్డాగా ఉన్న చేవెళ్లలో ముచ్చటగా మూడోసారి గెలిపించి, అధినేత కేసీఆర్‌కు కానుకగా అందిద్దాం. అమలుకు సాధ్యంకాని హామీలను నమ్మి మరోసారి మోసపోయేందుకు బీసీ, మైనార్టీలు సిద్ధంగా లేరని చాటిచెబుదాం. *- మహమ్మద్ ఖాసీం, కొండాపూర్*

3 చోట్ల..ఇంటర్‌చేంజ్ స్టేషన్లు

మూడు కారిడార్లతో మెట్రో ఎయిర్‌పోర్టు అనుసంధానం

అనువైన స్థలాల కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో మెరుగైన, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థలను అందుబాటులోకి వచ్చేందుకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా రెండో దశ మెట్రో ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఎయిర్‌పోర్టు మార్గాన్ని ఇప్పటికే మొదటి దశలో నిర్మించిన మూడు మెట్రో కారిడార్లను కలుపుతూ నిర్మించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. అలాగే ఇన్నర్ రింగు రోడ్డుపై మూడు చోట్ల ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్లను అందుబాటులోకి తీసుకు రానున్నారు. ఇందుకోసం పట్టణ ట్రాఫిక్ నిపుణులతో ప్రత్యేకంగా సర్వే చేయించి, ఏ సమయంలో ఎక్కడెక్కడ ఎంత ట్రాఫిక్ రద్దీ ఉన్నది. దానికి పరిష్కారంగా ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్నదానిపై ఇప్పటికే హైదరాబాద్ మెట్రో అధికారులు సర్వే చేపట్టారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి స్వయంగా ఇన్నర్ రింగురోడ్డు మార్గంలో నాగోల్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు 14 కి.మీ నడుచుకుంటూ వెళ్లి.. మెట్రో స్టేషన్లకు అనువైన ప్రాంతాలను గుర్తించారు. ఇందులో భాగంగానే మొదటి దశలో మెట్రో ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు కారిడార్‌లైన మియాపూర్-ఎల్‌బీనగర్(కారిడార్-1), జేబీఎస్-ఫలక్‌నుమా-చాంద్రాయణగుట్ట(కారిడార్-2), నాగోల్-రాయదుర్గం(కారిడార్-3) మెట్రో మార్గాలను కొత్తగా నిర్మించే ఎయిర్‌పోర్టు మెట్రో మార్గానికి అనుసంధానం చేసేందుకు అత్యంత అనుకూలమైన ప్రాంతాలను గుర్తించారు. అలాగే ఇన్నర్ రింగు రోడ్డుపై కొత్తగా నిర్మించాలని ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు మెట్రో మార్గంలో మూడు అత్యంత కీలకమైన జంక్షన్లను గుర్తించారు. వీటిలో నాగోల్ మూసీ నది పక్కన ఉప్పల్‌భగాయత్ లేఅవుట్ దగ్గర ప్రారంభమయ్యే ఎయిర్‌పోర్టు మెట్రో స్టేషన్ అటు ఇప్పటికే ఉన్న నాగోల్ మెట్రో స్టేషన్‌ను కలుపుతుంది. మూసీ నది పొడవునా చేపట్టే ఈస్ట్-వెస్ట్ కారిడార్‌తోనూ కలుస్తుంది. కారిడార్-3 సైతం దీనికి అనుసంధానం అవుతుంది. ఇదిలా ఉంటే ఎల్బీనగర్ జంక్షన్‌లో ఇప్పటికే కారిడార్-1 మెట్రో మార్గం ఉండడంతో దానికి అనుసంధానం చేస్తూ మరో మెట్రో స్టేషన్‌ను నిర్మించి స్కైవాక్‌లతో రెండు మెట్రో స్టేషన్లను అనుసంధానం చేయనున్నారు. ఇక చాంద్రాయణ గుట్ట వద్ద కలిసే కారిడార్-2తో ఎయిర్‌పోర్టు మెట్రో మార్గాన్ని అనుసంధానం చేసేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేశారు. శ్రీశైలం హైవే వైపు వెళ్లే చోట ఫ్లై ఓవర్ ఉండటంతో అనువైన స్థలం ఎంపిక సవాలుగా మారిందని, అయినా పలు కోణాల్లో అధ్యయనం చేసి ఇంటర్‌చేంజ్ మెట్రో స్టేషన్‌ను నిర్మిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఆగస్టు 8 వరకు మూఢాలే..

పురోహితుడు జోషి సత్యనారాయణరావు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 28 : ఈ ఏడాది ఫిబ్రవరి 11న ప్రారంభమైన పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఆదివారం వరకు జోరుగా కొనసాగాయి. శుభ కార్యాలు చేయాలంటే సోమవారం నుంచి ఆగస్టు 8 వరకు ఆగాల్సిందే.. మూఢాల కాలంలో లగ్న పత్రికలు రాసుకోవడం, వివాహానికి సంబంధించిన మాటలు మాట్లాడుకోవడం చేయరాదు. పుట్టు వెంట్రుకలు తీయించరాదు. నూతన గృహ నిర్మాణ శంకుస్థాపనలు చేయరాదు. ఇల్లు మారరాదు. అయితే అన్న ప్రాసన, ఇంటి మరమ్మతులు, భూములు అమ్మడం, కొనడం, ఒప్పందాలు చేసుకోవడం, నూతన వాహనాల కొనుగోలు వంటివి చేసుకోవచ్చని పురోహితుడు జోషి సత్యనారాయణరావు తెలిపారు. ఆగస్టు 9 నుంచి సెప్టెంబర్ 8 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. మరలా సెప్టెంబర్ 9 నుంచి నరక చతుర్దశి వరకు మంచి ముహూర్తాలు లేవు. సోమవారం నుంచి మూఢాలు ప్రారంభం కానుండడంతో పలువురు చిన్న చిన్న శుభ కార్యాలను పూర్తి చేశారు. కొత్తగా నిర్మించే ఇళ్లకు దర్వాజలను నిలబెట్టడం, ఇంటి నిర్మాణం ప్రారంభించి ఏడాది తిరగక ముందే వాస్తు పూజలు చేయడం వంటి వాటిని పూర్తి చేశారు. పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు లేకుంటే సాధారణంగా బసవ జయంతి రోజున ఎలాంటి ముహూర్తం చూడకుండా పెళ్లిళ్లు చేస్తారు. కానీ వచ్చే నెల బసవ జయంతి కూడా మూఢాల సమయంలో రావడంతో చాలామంది పెళ్లిళ్లు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు.

స్మార్ట్ వియరబుల్స్‌పై వర్క్‌షాప్

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : భౌతిక ఆవిష్కరణలకు కేంద్రంగా మారిన టీవర్క్స్‌లో ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వేసవి క్యాంపులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో కొత్త ఉత్పత్తుల తయారీ విధానంపై వర్క్‌షాపులను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా శనివారం నుంచి హైదరాబాద్, చెన్నై నగరాల్లోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ డిజైన్, ఫ్యాషన్ డిజైన్ సంస్థలతో కొత్త ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్మార్ట్ వియరబుల్స్‌పై నిపుణులతో శిక్షణనిచ్చారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు టీ వర్క్స్ వేదికగా కొత్త ఉత్పత్తుల డిజైన్‌తో పాటు వాటిని వినూత్నంగా తయారుచేసే అంశాలపై నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించారు. వేసవి సెలవుల నేపథ్యంలో టీ వర్క్స్‌లో పిల్లల కోసం సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నామని, ఔత్సాహికులు టీ వర్క్స్ వెబ్‌సైట్ ద్వారా సంప్రదించి, తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.